# ప్రేమంటే...!


స్కెచ్

దామెర్ల సుబ్బారావు

**మా**నవుల్ని హెచ్చరించిన ప్రేమనే పదం

చిన్ననాటి స్నేహితుల్ని, పవిత్ర ప్రేమానుబంధాల్ని తలచుకుంటూ... ఆంతరంగికంగా అలసిపోయి, దిగులుతో పడుకున్నా- కాని నిద్ర పట్టిందో లేదో మాత్రం చెప్పలేను-

హటాత్తుగా కీచుపడిన గొంతు స్వరంతో ఆశలు నిరాశలు చేసుకొని అనేక సంవత్సరాల బాంధవ్యాలు ఒక్కమాటు తెగిపోయినట్లుగ, ఎవరో- ఎందుకో, వింత వింతల అయోమయపు అట్టడుగు అడుగు



జాడల్లో అలమటిస్తున్నారు.

వినండి మానవుల్లారా! ఊహ వచ్చింది మొదలు నన్ను ఆశిస్తారు- యవ్వనం తొలికింది మొదలు నన్ను ప్రేమిస్తారు- వయస్సు తిరుగుతున్న కొద్దీ నన్ను వాంఛిస్తూనే ఉంటారు-

నరులైన నరపశువులందరూ నా కోసం నిరంతరం నిత్యపూజారులై, గాఢంగా గౌరవిస్తూనే వుంటారు. దానికి మానవుల ఎదుట వికసించి, ఆనందిస్తూనే ఉంటా- కాని వారు నా పాలిట శత్రువులు- గర్భశత్రువులు- నిరంతరం నన్ను గూర్చే తన్మయత్వం చెందే మానవులందరూ బుద్ధిహీనులు.

వారికి ఆశలు ఎక్కువ- ఆలోచనలు తక్కువ- వారికి బడాయిలు ఎక్కువ- బాటలు తక్కువ- వారికి ఆరాటాలు ఎక్కువ- ఆనందం తక్కువ. ఒకటేమిటి అన్నిటిలోను అసమర్థులే! నాలో నాట్యం చేసే శక్తిని కూడ క్షీణింపచేస్తున్నారు-

సందుల్లోను- గొందుల్లోను, రిక్షాల్లోను, బండ్లల్లోను- రైళ్లల్లోను, విమానాల్లోను- ఇళ్ళల్లోను, సత్రవుల్లోను-బారుల్లోను, విహారయాత్రల్లోను ఒకటేమిటి ఊరూర- యింటింట నేనే- నన్ను గురించి ఆలోచించనివారు లేరు- వేళ- పాళ లేదు. నన్ను తలచుకున్నప్పుడెల్లా వారిలో ఉద్రేకమో, ఉన్మాదమో, ఉత్తేజమో, ఆనందమో, అంధకారమో ఆప్యాయతతో ఆహ్వానిస్తాయట- పిలుస్తాయట. పలుకరిస్తాయట- మనస్సు మారిపోతుందట-

గుండె నీరైపోతుందట- మెదడు ఖరాబైపోతుందట- ప్రతి కండరంలోను కంట్రోలు తప్పిపోతుందట-

అందుచేతే వారు తెలియకుండా, ఆవేశంతో ఆతృతతో, ఆరాటంతో, ఆర్భాటంతో ఏవేవో చేస్తున్నారట.

అందరూ నా కోసం విలపించేవారే- నా కోసం ఆశించేవారే. నేను వారి మెదడుల మధ్య గడియారపు ముల్లులా గిర్రుమని తిరుగుతూనే ఉంటానుట- పలుకరిస్తూ, పాటలు పాడుతూ, ఆలాపిస్తూనే ఉంటానుట-

ఈ అపవిత్రమైన అంధకారాన్ని ఊహించలేని రణధ్వనులు వింటూ వుంటే అంతరాత్మలో ఆలోచిస్తూ, పరిశీలిస్తూనే ఉంటా! ఎందుకని ఎందుకనుకుంటారేమో!

మత్తెక్కి, మైమర్చి, ఒళ్ళు తెలియక, మూఢులై, కామపాశంచే, కళ్ళు మూసుకుపోయి "నేను అన్న పదంతో" నన్ను ఉపయోగించుకొంటూ, అంధ కారంలోకి లాగుతున్నారు- నన్ను అస్తమాను అలా ఆడుకోవద్దని ఎన్నోసార్లు హెచ్చరించా- నా మాట వినలేదు- నన్ను అంటే నేను అన్న పదంతో అపవిత్రంగా వాడుకొనే, పెద్ద మనుష్యులు ఎక్కువైపోయారు-

రోజురోజుకు నా ఆశలు శుష్కించాయి- దేహం సన్నగిల్లింది- నిరాశలు తలెత్తటం మొదలు పెట్టాయి-

అప్పటినుంచి నన్ను గూర్చి అస్తమాను ఆలోచించే నరపశువులందర్నీ కఠోరంగా కర్కశులు అన్నా- వెధవలంటూ వెక్కిరించా- ఒకటేమిటి అనేక విధాలుగా ఘోరంగా తిట్టా- ఏం చెయ్యను...

పవిత్రమైన పసిపాపల్ని కూడ నా యిష్టం వచ్చినట్లు ఏవేవో అనేసా- ప్రతిఒక్కడు నేను 'అన్న పదంతో' నన్ను రెచ్చకొట్టడం ఎందుకు- కామాంధకారంలో కన్నుమిన్ను తెలియకుండా సంచరించటం ఎందుకు?

నన్ను అర్థం చేసుకుని, పవిత్రంగా మసలుకొనేవారు, దాని విలువను అర్థించేవారు, దాని కోసం ప్రాణాలు సైతం అర్పించేవారు కూడ వున్నారు. వారి మెలకువ కొరకు వేచియున్నా- నన్ను మీరు గౌరవించేలా గౌరవించకపోతే వేరే ప్రదేశాన్కి పయనిస్తా- నా పవిత్రతనంతా గంగపాలు చేస్తున్నారంటూ విషాదాన్ని వెళ్ళకక్కుతూ అర్ధరాత్రివేళ ఆక్రోశిస్తున్నారు ఎవరో?

నా తల తిరిగింది- మతి చెడిపోయింది- అమ్మా అంటూ లేచా- ఎవరూ లేరు- నాలుగు పక్కల చూసా- నేను తప్ప మరి ఎవరూ లేరు- స్థిరత్వాన్ని ఏర్పర్చుకొని కలవరపడకుండా స్వప్న సందేశమని తెలుసుకున్నా- ఏమిటంటారేమో... 'ప్రేమ' వచ్చి ప్రేరేపించింది- జగత్తులో తన్ను యిష్టం వచ్చినట్లు ఉపయోగించుకుంటున్నారని, 'ప్రేమ' అన్న పదాన్కి పవిత్రత, నిజాయితీ లేకుండా చేస్తున్నారని, యింకా ఎన్నెన్నో విధాలుగా తన్ని హింసిస్తున్నారని, ప్రేమనే పదాన్కి న్యాయం చేయటం లేదని, 'ప్రేమ' కలవరంతో, కాంతి విహీనంగా శూన్య ప్రపంచంలోకి, జీవితపు ఎడారుల్లోకి, శాంతి తప్పి జ్వలిస్తున్న జగత్తులోకి, వెర్రిమొర్రిగా గోలపెడుతూ, మానవుల్ని హెచ్చరిస్తూ ముందుకు సాగుతోంది- పాపం-

ఇప్పటికైన తెలుసుకున్నారా 'ప్రేమంటే'!